కూసుమంచి శివాలయాన్ని సందర్శించిన పీవీ శ్రీనివాస్

శివాలయంలో పూజలు చేస్తున్న పీవీ శ్రీనివాస్, సృజన దంపతులు

కూసుమంచి, మే 25: కూసుమంచి శివాలయంలో ఆదివారం సమాచార హక్కు చట్టం కమిషనర్ పీవీ శ్రీనివాస్ దంపతులు సందర్శించిన ప్రత్యేక పూజలు చేశారు. తొలుత కమిషనర్‌కు పాలకమండలి సభ్యులు, దేవాదాయశాఖ, రెవెన్యూశాఖ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ కాకతీయుల నాటి శివాలయం కళావైభవం చరిత్రలో నిలిచి పోతుందన్నారు. ఎంతో గొప్ప చరిత్ర కలిగిన ఆలయాన్ని సందర్శించటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సతీమణి సృజన, ఆలయ చైర్మన్ రేలా ప్రదీప్‌రెడ్డి, తహసీల్దార్ కరుణశ్రీ, ఈవో కాముని శ్రీకాంత్, కమిటీ సభ్యులు కందుల వీరబాబు, హలావత్ రెడ్యానాయక్, తిరుపతిరావు, చెన్నె రవి, జూనియర్ అసిస్టెంట్ రామదాసు, పూజారులు దేవులపల్లి శేషగిరి శర్మ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

కారేపల్లి, మే 25: మండల పరిధిలోని మాదారం కే.వీ. విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో 2004-2005లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు నేర్పిన గురువులకు పుష్పగుచ్చాలు అందించి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. కలిసి చదువుకున్న విద్యార్థులంతా 20 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై చేరుకొని ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. స్నేహితులందరూ ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఉపాధ్యాయులను శాలువాలు, మెమంటోలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రంగారావు, ఇన్‌చార్జి పగడాల నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు రావుల శ్రీను, సంగమూరి రామకృష్ణ, బానోత్ శంకర్, గోరేపాటి వెంకటేశ్వర్లు, తల్లడి మల్లయ్య, ఏజీసీఎం చర్చి పాస్టర్ ఎం ఏలియా, కమిటీ సభ్యులు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్ననాటి స్నేహితుల అపూర్వ కలయిక

చాలా ఏండ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

రఘునాథపాలెం, మే 25 : ఉన్నత చదువుల కోసం తలోదిక్కు వెళ్లిన చిన్ననాటి స్నేహితులు 30 ఏండ్ల తర్వాత మళ్లీ కలుసుకున్నారు. తమ చిన్నప్పటి తీపి గుర్తులను నెమరు వేసుకున్నారు. ఈ వేడుకకు ఖమ్మం నగరం గొల్లగూడెం రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్ వేదికైంది. చింతకాని మండలం కొదుమూరు జెడ్పీ హైస్కూల్‌లో 1995-96 సంవత్సరం 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఒకచోట కలుసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించుకున్నారు. రోజంతా స్నేహితులతో సందడిగా గడిపారు.

కొనసాగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ఖమ్మం అర్బన్, మే 25 : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం నిర్వహించిన ప్రథమ సంవత్సరం పరీక్షల్లో 4,918 మందికి 306 మంది గైర్హాజరై 4,612 మంది హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో 1,776 మందికి 71మంది గైర్హాజరై 1705మంది హాజరయ్యారు. పరీక్షలు జరుగుతున్న కేంద్రాల్లో 21 సెంటర్లను ఫ్లయింగ్ స్క్వాడ్స్, డీఈసీ సభ్యులు తనిఖీ చేశారని డీఐఈవో రవిబాబు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

MARKS MEMO LOST

I, **PAGADALA LAXMI SATHWIKA,** D/o. Pagadala Nageswara Rao, R/o. H.No. 2-4-164/2, Sriram Nagar, Khammam Urban Mandal, Khammam Dist, that while Travelling to Xerox center, Palvoncha lost my Secondary School Certificate Original and Migration Certificate **(No:20158602).**Those who found it please inform to below numbers.

Cell : 99660 37499

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రైతులకు విత్తనాలు, ఎరువులు అందించాలి

కొణిజర్ల, మే 25: రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను సబ్సిడీపై ప్రభుత్వమే అందించాలని అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా నాయకుడు షేక్ ఖాసీం ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. నకిలీ విత్తన వ్యాపారులపై పీడీయాక్ట్ కింద కేసు నమోదు చేయాలన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన షాపుల నుంచే విత్తనాలను కొనుగోలు చేసే విధంగా రైతుల్లో ప్రభుత్వం అవగాహన కల్పించాలన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

'వంద'ను ఓపెన్ చేయరా..?

నిర్మాణం పూర్తయి అలంకారప్రాయంగా ఉన్న ఆసుపత్రి, ప్రస్తుతం హెల్త్ కమ్యూనిటీ సెంటర్‌లోనే వైద్యం, శిథిలావస్థకు చేరుకున్న హెల్త్ కమ్యూనిటీ ఆసుపత్రి

- నిర్మాణం పూర్తయినా ప్రారంభోత్సవానికి నోచుకోని ఆసుపత్రి
- మెరుగైన వైద్య సేవల కోసం నగరాలకు వెళ్తున్న మధిర వాసులు
- ప్రతిపక్ష పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపినా పట్టింపు కరువు

మధిర, మే 25 : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి మధిర పట్టణంలో నిర్మించిన వంద పడకల ఆసుపత్రి ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రూ.36 కోట్ల వ్యయంతో మూడు అంతస్తులతో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తయింది. 2024 జనవరి నెలలో ప్రారంభించేందుకు అధికారులు సిద్ధం చేయగా.. ఈ లోగా అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రావడం.. కోడ్ అమలులో ఉండడంతో ప్రారంభోత్సవం వాయిదా పడింది. రాష్ట్రంలో పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆసుపత్రి ప్రారంభోత్సవాన్ని పట్టించుకోకపోవడంతో ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికే 100 పడకల ఆసుపత్రికి కొందరు వైద్య సిబ్బందిని కేటాయించినప్పటికీ ఆసుపత్రి ప్రారంభం కాకపోవడంతో ప్రస్తుత కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లోనే వారు వైద్య సేవలు అందిస్తున్నారు. సీహెచ్‌సీ కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో వైద్యులతోపాటు రోగులు ఇబ్బందిపడుతున్నారు. ఇక సీహెచ్‌సీకి వచ్చే రోగులకు అత్యవసర ఆపరేషన్లు చేయాలంటే 60 కిలోమీటర్ల దూరంలోని ఖమ్మం పెద్దాసుపత్రికి రెఫర్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కొందరు మెరుగైన వైద్య సేవల కోసం ఆర్థిక భారమైనప్పటికీ ఖమ్మం, విజయవాడ, హైదరాబాద్ వెళ్లాల్సి వస్తోంది. ఈ క్రమంలో ఆసుపత్రిని ప్రారంభించాలని కోరుతూ బీఆర్ఎస్, సీపీఎం, బీజేపీ తదితర పార్టీల ఆధ్వర్యంలో కొత్త భవనం ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టిన విషయం తెలిసిందే. ఇప్పటికైనా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క 100 పడకల ఆసుపత్రిని ప్రారంభించి మెరుగైన వైద్య సేవలు అందుబాటులో తీసుకురావాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

వైద్య సిబ్బందిని కేటాయించాలి..

మధిరలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తయ్యింది. ఆసుపత్రికి ఇంకా 103 మంది వైద్య సిబ్బంది రావాల్సి ఉంది. ప్రస్తుతానికి సీహెచ్‌సీ సిబ్బంది ద్వారానే ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాం. ఆసుపత్రికి వైద్య సిబ్బందిని వైద్య విధాన పరిషత్ కేటాయిస్తేనే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తాం. ఇంకా ఆసుపత్రిలో మార్చురీ, ఆర్వో ప్లాంటు చేయాల్సి ఉంది. దీనిపై వైద్య విధాన పరిషత్‌కు నివేదిక అందజేశాం.

- డాక్టర్ అనిల్‌కుమార్,
ఆసుపత్రి సూపరింటెండెంట్, మధిర

జర్నలిస్ట్ మునీర్ మృతి పట్ల సంతాపం

ఖమ్మం, మే 25 : ప్రముఖ జర్నలిస్ట్ మహ్మద్ మునీర్ అకాల మృతి పట్ల బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. మునీర్ సింగరేణి కార్మికుల న్యాయమైన హక్కుల పరిష్కారానికి, పేదలపక్షాన ఎన్నో వార్తలు, కథనాలు రాశారని, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన మహోద్యమంలో చురుకైన పాత్ర పోషించారని ఎంపీ పేర్కొన్నారు. ఆయన అకాల మృతి తెలంగాణ సమాజానికి, పత్రికా రంగానికి తీరని లోటన్నారు. మునీర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మునీర్‌కు టీడబ్ల్యూజేఎఫ్ సంతాపం

జర్నలిస్టు మునీర్‌కు టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించింది. మునీర్ స్వస్థలం మంచిర్యాల జిల్లా మందమర్రిలో ఆదివారం నిర్వహించిన అంతిమ యాత్రలో జిల్లా నాయకులు సయ్యద్ ఖదీర్, షేక్ సుభాన్, కూసుమంచి గ్లోబల్ రెయిన్‌బో స్కూల్ కరస్పాండెంట్ మహమ్మద్ ఇర్షాద్ అహ్మద్, షేక్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

మధిరలో వైద్యశిబిరం

వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

మధిర, మే 25: ముస్లిం ఐక్యసంఘం ఆధ్వర్యంలో మధిర పట్టణంలోని రాయపట్నంరోడ్డులో గల షాదీఖానాలో ఖమ్మంకు చెందిన ఇండోకేర్ ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో ఎండీ డాక్టర్ షేక్ ఫయాజ్ వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం ఐక్య సంఘం అధ్యక్షుడు షేక్ ముజాహిద్, ఉపాధ్యక్షుడు షేక్ హుస్సేన్, కార్యదర్శి షేక్ మహమ్మద్‌గౌసుద్దీన్, మధిర మండల అధ్యక్ష, కార్యదర్శులు షేక్ గాలిబ్, షేక్ సైదులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గొర్రె మృతి

మధిర, మే 25: మండలంలోని రొంపిమల్ల గ్రామానికి చెందిన సిరియాల నర్సింహారావుకు చెందిన గొర్రెలు మేత కోసం పొలంలోకి వెళ్లాయి. మంద నుంచి ఒక గొర్రె విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్ కు గురై మృతిచెందింది. ఘటన స్థలాన్ని అధికారులు పరిశీలించారు.

ఎంపీ వద్దిరాజుతో కాపు నాయకుల భేటీ

ఖమ్మం, మే 25: బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రతో కాపు సంఘం నాయకులు ఆదివారం భేటీ అయ్యారు. కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చందు జనార్దన్, రాధా మిత్ర మండలి సీనియర్ నాయకుడు అల్లుడు సాంబశివరావు, ప్రముఖ వ్యాపారవేత్త గంటా సాయి, సీనియర్ జర్నలిస్ట్ మేకల కళ్యాణ్ చక్రవర్తి ఎంపీ రవిచంద్రను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు సమకాలీన అంశాలపై ఇష్టాగోష్టిగా మాట్లాడుకున్నారు.

ఎంపీ వద్దిరాజును కలిసిన కాపు సంఘం నాయకులు

మంత్రిప్రగడకు ప్రథమ బహుమతి

ఖమ్మం మే 25 : ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త మంత్రిప్రగడ శ్రీనివాసరావుకు రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి సాహితీ సమీక్ష పోటీల్లో ప్రథమ బహుమతి లభించింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం జరిగిన పురస్కారాల ప్రదానోత్సవంలో బహుమతి అందుకున్నారు. క్యాన్సర్ మహమ్మారితో బాధపడుతున్న సాహితీవేత్త ఐనంపూడి శ్రీలక్ష్మి క్యాన్సర్‌పై రాసిన మోనోలాగ్ ఆఫ్ ఏ వూండెడ్ హార్ట్ సుదీర్ఘ కవితకు సమీక్ష పోటీలు నిర్వహించగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 200మంది సుప్రసిద్ధ సాహితీవేత్తలు పాల్గొనగా శ్రీనివాసరావుకు ప్రథమ బహుమతి లభించింది. జిల్లాకు చెందిన సాహితీవేత్తలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు మంత్రిప్రగడను ప్రత్యేకంగా అభినందించారు.

మంత్రిప్రగడ శ్రీనివాసరావును సత్కరిస్తున్న దృశ్యం

ఖమ్మం బాల సాహితీవేత్తలకు సత్కారం

ఖమ్మం/ ఖమ్మ అర్బన్, మే 25 : తెలంగాణ సారస్వత పరిషత్తు 82వ స్థాపన దినోత్సవం సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఖమ్మం జిల్లాకు చెందిన బాల సాహితీవేత్తలు, ఉపాధ్యాయులను సత్కరించారు. గత ఇరవై ఏళ్లుగా పిల్లల్లో కథా కవితా రచనలు చేయిస్తూ, పుస్తకాలు ప్రచురిస్తున్న ఖమ్మం బాల సాహితీవేత్తలైన ఉపాధ్యాయులు కన్నెగంటి వెంకటయ్య, కొమ్మ వరపు కృష్ణయ్య, సయ్యద్ షఫీ, జుర్రు సునందలకు సన్మానం జరిగింది. తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఎల్లూరి శివారెడ్డి, కార్యదర్శి జుర్రు చెన్నయ్య పాల్గొన్నారు. ఖమ్మంజిల్లా బాలసాహిత్య వేదిక, తెలుగు ఫోరం మిత్రులు, సాహితీకారులు హర్షం వ్యక్తం చేశారు.

ఖమ్మం బాల సాహితీవేత్తలను సత్కరించిన దృశ్యం

సమస్యలపై ప్రజలను చైతన్యం చేయాలి

తిరుమలాయపాలెం, మే 25: ప్రజా సమస్యలపై ఆటలు పాటల ద్వారా కళాకారులు ప్రజలను చైతన్యం చేయాలని ప్రజానాట్య మండలి ఖమ్మం నాయకుడు వేముల సదానందం పిలుపునిచ్చారు. ఆదివారం తిరుమలాయపాలెంలో జరిగిన సంఘం పాలేరు డివిజన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతరించిపోతున్న కళలు, వాటి విలువలు సామాజిక సేవా దృక్పథంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. ప్రజాసమస్యలపై ప్రజానాట్య మండలి అనునిత్యం పోరాడుతుందని చెప్పారు. సమావేశంలో నాయకులు కొండల్‌రావు, లక్ష్మీనారాయణ, ప్రసాద్, వెంకటేశ్వరావు, జ్యోతి, కొమ్ము శ్రీను పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వేముల సదానందం

మృత్యువాత పడుతున్న జీవాలు, పశువులు

విషాహారం వల్ల మృతి చెందిన జీవాలు, జీవాల యజమానులతో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ సమితీ సభ్యులు, బాగం హేమంతరావు, నాయకులు

ఖమ్మం రూరల్, మే 25: మండలంలోని చింతపల్లి, ఆరెకోడు తండాలో ఈ నెల మొదటివారం నాలుగురోజుల పాటు దాదాపు పదిపదిహేను పశువులు విషాహారం తిని మృత్యువాత పడ్డాయి. పశు వైద్యులు పోస్టుమార్టంలో విషాహారం తినడం వల్లనే మృతిచెందాయని పేర్కొన్నారు. ఈ ఘటన మరువక ముందే తాజాగా ఆదివారం ఆరెకోడు తండాలో ఓ బర్రెతో పాటు 30 జీవాలు మృత్యువాత పడగా, మరికొన్ని జీవాలు ఖమ్మం పశువైద్యశాలలో చికిత్స తీసుకుంటున్నాయి. విషయం తెలుసుకున్న మండల పశువైద్యుడు అనంతుల హరీష్ ఆధ్వర్యంలో వైద్య బృందం గ్రామాన్ని సందర్శించి మృత్యువాత పడిన జీవాలకు పంచనామ నిర్వహించారు. కూరగాయల పంటల సాగుకు రసాయక మందులు పిచికారీ చేసిన వెంటనే పశువులు మేత మేయడం వల్లే చనిపోయాయని, వేటగాళ్ల బలికి మృతిచెందవచ్చని గ్రామస్తులు పేర్కొంటున్నారు. వేసివి కాలంలో పశువుల, జీవాల యజమానులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యులు రైతులకు సూచిస్తున్నారు. గ్రామంలో జీవాలు చనిపోయిన సంగతి తెలుసుకున్న రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

జీవాల యజమానులకు న్యాయం చేయాలి

ఖమ్మం రూరల్ మండలం ఆరెకోడు తండాలో విషహారం తిని జీవాలు మృతిచెందాయని, జీవాల రైతులకు న్యాయం చేయాలని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండలంలోని ఆరెకోడు తండాలో విషాహారం తిని వందల సంఖ్యలో జీవాలు ఆనారోగ్యానికి గురికాగా వాటిని ఖమ్మం నగరంలోని పశువైద్యశాలలో చికిత్స చేయిస్తున్నారు. విషయం తెలుసుకున్న హేమంతరావు పార్టీ నాయకులతో కలిసి వైద్యశాలకు వచ్చి జీవాల యజమానులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జీవాల యజమానులందరు నిరుపేదలని, కేవలం వీటిపైనే ఆధారపడి జీవిస్తున్నారని పశువైద్యులతో మాట్లాడారు. ప్రభుత్వం స్పందించి తగిన పరిహారం అందజేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు దండి సురేష్, యడ్లపల్లి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి భరోసా..

ఖమ్మం రూరల్ మండలంలోని ఆరెకోడు తండాకు చెందిన జీవాల యజమానులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా కల్పించారు. ఆదివారం తండాలో అనుమానాస్పదస్థితిలో మేకలు, గొర్రెలు చనిపోయిన విషయానికి ఫోన్ ద్వారా మంత్రి పొంగులేటికి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామరెడ్డిల దృష్టికి కాంగ్రెస్ నాయకుడు సయ్యద్ సాధిక్ అలీ తెలిపారు. స్పందించిన మంత్రి, ఎంపీ జీవాల యజమానులకు అవసరమైన నష్ట పరిహారం అందించడం జరుగుతుందని హామీ ఇచ్చారని సాధిక్ అలీ తెలిపారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు నివాళి

బాలరాజు భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, నాయకులు

మధిర, మే 25: మండలంలోని ఆత్కూరు గ్రామానికి చెందిన మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దారా బాలరాజు ఆదివారం గుండెపోటుతో మృతిచెందారరు. విషయం తెలుసుకున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మల్లు నందిని దంపతులు, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, బీజేపీ నాయకులు నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు సూరంశెట్టి కిషోర్, అధికారులు బాలురాజు భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. నివాళి అర్పించిన వారిలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, చావా వేణు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, కోనా నరేందర్‌రెడ్డి, యన్నంశెట్టి వెంకటఅప్పారావు, పరిష శ్రీనివాసరావు, చీదిరాల రాంబాబు, ఐలూరి ఉమామహేశ్వరరెడ్డి ఉన్నారు.

సత్తమ్మకు సీపీఎం నాయకుల నివాళి

తిరుమలాయపాలెం, మే 25: మండలంలోని జూపెడకు చెందిన సీపీఎం నాయకురాలు కోట సత్తమ్మ (80) ఆదివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు, నాయకులు మాదినేని రమేశ్, బషీరుద్దీన్, కొమ్ము శ్రీను, అంగిరేకుల నర్సయ్య, కోట ఉపేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నూకల శ్రీనివాసరెడ్డిలు సత్తెమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కూసుమంచి, మే 25: మూడు రోజుల క్రితం పాము కాటుకు గురైన మహిళ చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన మండలంలోని నర్సింహులగూడెంలో ఆదివారం చోటుచేసుకున్నది. నర్సింహులగూడెం గ్రామానికి చెందిన పెరుమాళ్లపల్లి విజయ (38)ఈ నెల 22న రాత్రి ఇంట్లో చాపపై నిద్రిస్తుండగా పాము కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ఖమ్మం ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. విజయ మరిది సుధాకర్ ఫిర్యాదు మేరకు ఎస్సై నాగరాజు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కూతుర్ని ఆసుపత్రిలో చేర్పించి వస్తుండగా ప్రమాదం

కొణిజర్ల, మే 25: ఆరోగ్యం సరిగా లేని చిన్నారిని ఆసుపత్రిలో చేర్పించి ఇంటికి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదం కబలించిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దరాంపురం గ్రామానికి చెందిన ఇనుపనూరి నాగేశ్వరరావు(35) తన కూతురు ప్రియకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఖమ్మంలోని ఓ ఆసుపత్రిలో చేర్పించారు. రక్తం అవసరం కావడంతో అందుకు కావాల్సిన డబ్బులు తెచ్చేందుకు ఇంటికి వస్తుండగా కొణిజర్ల పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎదురుగా వస్తున్న మధిర డిపో ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య సుష్మ, కుమార్తెలు ప్రియ, ప్రసన్న, అక్షయ ఉన్నారు. నాగేశ్వరరావు మృతితో పెద్దరాంపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎస్సై జీ.సూరజ్ మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఖమ్మం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకు దుర్మరణం

శారద (ఫైల్) కార్తీక్ (ఫైల్)

రఘునాథపాలెం, మే 25 : శుభకార్యానికి వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకు మృతిచెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కామేపల్లి మండలం జాస్తిపల్లి గ్రామానికి చెందిన బత్తుల వెంకటస్వామి తన భార్య శారద(31), కుమారుడు కార్తీక్(12)తో కలిసి ఆదివారం తన ద్విచక్ర వాహనంపై ఖమ్మంలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికొచ్చే క్రమంలో బూడిదంపాడు పవర్‌గ్రిడ్ వద్ద రోడ్డుపక్కన తాటిముంజలు కొనుగోలు చేసేందుకు ఆగారు. తిరిగి రోడ్డు ఎక్కుతుండగా ఖమ్మం నుంచి ఇల్లెందు వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి వెంకటస్వామి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన ముగ్గురిని హూటాహుటిన ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ తల్లీకొడుకు మృతి చెందారు. వెంకటస్వామి చికిత్స పొందుతున్నాడు. వెంకటస్వామి బీఆర్ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

సబ్సిడీపై జీలుగు విత్తనాలు

ఎర్రుపాలెం, మే 25: మండలంలోని రాజుపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని నారాయణపురం సొసైటీలో సోమవారం నుంచి సబ్సిడీపై జీలుగు విత్తనాలు పంపిణీ చేస్తామని జమలాపురం క్లస్టర్ ఏఈవో కే.వంశీకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 కేజీల జీలుగు బస్తా రూ.2,138 కు అందజేస్తామని పేర్కొన్నారు. రైతులు తమ ఆధార్‌కార్డు, పొలం పాస్‌బుక్ జిరాక్స్ తీసుకొని ఏఈవో కార్యాలయం దగ్గర ఆన్‌లైన్ కూపన్ తీసుకొని నారాయణపురం సొసైటీలో విత్తనాలు పొందాలని తెలిపారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

కొణిజర్ల, మే 25: విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎంఈవో డీ.అబ్రహాం అన్నారు. మండలంలోని తనికెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 15 రోజులుగా జరుగుతున్న సమ్మర్ క్యాంపు ఆదివారం ముగిసింది. ఈ క్యాంపులో విద్యార్థులకు డ్రాయింగ్, డ్యాన్స్, యోగ, కోలాటం, చెస్, క్యారమ్స్, కంప్యూటర్‌పై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ క్యాంపును జడ్పీ ఉన్నత పాఠశాల పీడీ శ్రీనివాస్ పర్యవేక్షించగా ఎల్.శ్రీదేవి, ఎల్.ఝాన్సీ, ఐ.రాజు, ఎం.యశ్వంత్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక